నాయికపు గూడెం పంచాయతీ అయ్యేనా?

- అర్హతలున్నా పంచాయతీ కాని నాయికపుగూడెం
- లక్ష్మీదేవిపల్లి గ్రామానికి 3 కిలోమీటర్ల దూరం
- అన్ని పనులకు తండావాసుల ఇబ్బంది


నాయికపు గూడెం

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ప్రతి చిన్న తండా గ్రామపంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. గత ప్రభుత్వంలో కొన్ని నూతన పంచాయతీల ఏర్పాటు జరిగితే, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో బీర్‌పూర్ మండలంలో రెండు నూతన పంచాయతీలు ఏర్పాటు కాగా, సారంగాపూర్ మండలంలో గణేష్‌పల్లి కొత్త పంచాయతీగా ఏర్పాటు కానుంది.

గత ప్రభుత్వ హయాంలో కొత్త పంచాయతీలు

500 కంటే ఎక్కువ జనాభా ఉండి ఆ గ్రామపంచాయతీకి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రతి తండాను పంచాయతీగా చేశారు. బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో 11 గ్రామాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ హయాంలో బీర్‌పూర్ మండలం గొండుగూడెం (మంగేళ), ఇందిరానగర్ (నర్సింహులపల్లె) గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. సారంగాపూర్ మండలం గణేష్‌పల్లిని(పోతారం) పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరిక మేరకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

నాయికపుగూడెం (లక్ష్మీదేవిపల్లి)

లక్ష్మీదేవిపల్లి పరిధిలోని నాయికపుగూడెంను గ్రామ పంచాయతీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇక్కడ జనాభా 300కు పైగా ఉంటుంది. ప్రీప్రైమరీ పాఠశాల కింద అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఇక్కడి చిన్నారులు ప్రాథమిక పాఠశాల చదువుల కోసం లక్ష్మీదేవిపల్లి వరకు కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. రేషన్ బియ్యం కోసం కూడా గిరిజనులు లక్ష్మీదేవిపల్లికి వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నాయకపుగూడెంను గ్రామ పంచాయతీగా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంచాయతీగా ఏర్పాటు చేయండి



మా కంటే చిన్న తండాలు పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. మా నాయికపుగూడెం మాత్రం పంచాయతీగా ఏర్పాటు జరగలేదు. మా పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాకు ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయండి.

– చంద్రమ్మ, నాయికపుగూడెం,(లక్ష్మీదేవిపల్లి)

ప్రతిపాదనలు పంపిస్తాం



ఉన్నతాధికారుల నుంచి నాయికపుగూడెం(లక్ష్మీదేవిపల్లి) పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆదేశాలు వస్తే, దానికి అనుగుణంగా పంచాయతీ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి పంచాయతీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతాం.

– చౌదారపు గంగాధర్,ఎంపీడీవో, సారంగాపూర్



కథలాపూర్: మండలంలోని సిరికొండ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా డైనింగ్ హాల్ నిర్మాణం పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థులు నేలపై కూర్చుండి భోజనం చేస్తున్నారు. అధికారులు చొరవ చూపి డైనింగ్ హాల్ నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లోకిని శ్రీనివాస్,ఎంఈవో,కథలాపూర్ సెల్ నంబర్: 9491058667

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్లుప్తంగా

కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి


ఎమ్మెల్యేను కలిసిన లేడీస్ ఎంపోరియం అసోసియేషన్ సభ్యులు

జగిత్యాల: హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, ఆయన అనుచిత వ్యాఖ్యలు సమంజసం కాదని జగిత్యాల లేడీస్ ఎంపోరియం యూనియన్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు, ప్రవర్తనను వ్యతిరేకిస్తూ ఆయన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంజయ్య, శ్రీధర్, అశ్విన్ పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు


సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని డబ్బా, ఎర్రాపూర్ గ్రామాల్లో రేషన్ కార్డుల సర్వే పనులను ఆయన పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా చేయాలని రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదలను గుర్తించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మండలంలో 864 మంది కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రేవంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు


కవితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను హైదరాబాద్‌లో శుక్రవారం జగిత్యాల ఏఎంసీ మాజీ చైర్మన్ ఆసిఫ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట ఎన్ఆర్ఐ జాగృతి నాయకులు మహ్మద్ సైఫొద్దీన్, జగిత్యాల మండల మైనార్టీ అధ్యక్షుడు జహంగీర్, యూత్ నాయకులు సోహెల్ ఉన్నారు.

సహస్ర లింగాల ఆలయంలో చతుర్థి వేడుకలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస శివారులోని సహస్ర లింగాల దేవాలయంలో శుక్రవారం సంకష్టహర చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నలమాసు గంగాధర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోరుమల్లకు సబ్ స్టేషన్ మంజూరు

మేడిపల్లి: మండలంలోని పోరుమల్ల గ్రామానికి నూతన సబ్ స్టేషన్ మంజూరు చేస్తూ సీఎండీకే వరుణ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 2.65 కోట్ల నిధులతో నూతన సబ్‌స్టేషన్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న గ్రామస్తులు సబ్‌స్టేషన్ మంజూరు చేసినందుకు వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్‌కి ధన్యవాదాలు తెలిపారు. చైర్మన్ మాదం వినోద్, మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, నాయకులు గడ్డం జలందర్‌రెడ్డి, బద్దం రాజేందర్ రెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మేడిపల్లి: మండల ఉమ్మడి ప్రెస్ క్లబ్ క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక తహసీల్దార్ వసంత, ఎంపీవో నీరజ చేతుల మీదుగా ఉమ్మడి ప్రెస్ క్లబ్ క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చింతకింది లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శి మార్గం మహేశ్, ఉపాధ్యక్షులు ఎండీ రహీం, మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల సర్వే పరిశీలన


రేషన్ కార్డుల సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో

కోరుట్ల: పట్టణంలోని 5 నుంచి 9 వ వార్డు వరకు రేషన్ కార్డుల సర్వేను మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి శుక్రవారం పరిశీలించారు. సర్వే పారదర్శకంగా నిర్వహించాలని కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్, నాగులపేట గ్రామాల్లో రేషన్ కార్డుల సర్వేను ఎంపీడీవో రామకృష్ణ పరిశీలించి సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యదర్శులు పాల్గొన్నారు.

బుగ్గారం(ధర్మపురి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కోసం జరుగుతున్న సర్వేలో మున్సిపల్ ప్రత్యేకాధికారి ఆర్.ఎస్ చిత్రు పాల్గొని వివిధ వార్డులలో జరుగుతున్న సర్వే తీరుతెన్నులను పరిశీలించారు. ఈనెల 19 వ తేదీ వరకు సర్వే పూర్తి చేసి తేదీ 21 నుండి 23 వరకు వివిధ వార్డుల్లో నిర్వహించే సభల్లో ఆయా జాబితాలను ప్రదర్శించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

కథలాపూర్‌లో..

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల, గంభీర్‌పూర్, భూషణరావుపేట గ్రామాల్లో రేషన్‌కార్డుల దరఖాస్తుల సర్వే, రైతు భరోసా సర్వేను శుక్రవారం ఎంపీడీవో శంకర్ పరిశీలించారు. జాబితాలో పేర్లున్న ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఆయన వెంట కార్యదర్శులు లక్ష్మణ్, రవీందర్, ఎం.డీ గఫూర్ ఉన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం

మెట్‌పల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తామని ఆర్డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని 17 వార్డులో నిర్వహిస్తున్న సర్వేను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అర్హులకు నష్టం జరగకుండా సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, నాయకులు ఉన్నారు.

మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో చదును


పనులు పర్యవేక్షిస్తున్న చైర్మన్ ,డైరెక్టర్లు

కథలాపూర్: వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో మట్టిని పోసి చదును చేయించే పనులు శుక్రవారం చేపట్టారు. మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో పిచ్చిమొక్కలు పెరగడంతో రైతులకు ఇబ్బంది ఉందని భావించిన పాలకవర్గ సభ్యులు మట్టిని పోసి ట్రాక్టర్‌తో చదును చేయించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషా, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

బుగ్గారం: జాతీయ పసుపుబోర్డు ఏర్పాటు చేసినందుకు ప్రధాని నరేంద్రమోదీ,నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చిత్రపటాలకు పట్టణ,మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ధర్మపురి పట్టణంలోని నంది చౌక్ వద్ద క్షీరాభిషేకం చేశారు. పసుపు బోర్డు ఏర్పాటుతో ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్, నాయకులు బండారి లక్ష్మణ్, బెజ్జారపు లవణ్, నలుమాసు వైకుంఠం, అప్పం మల్లేశ్, పోగుల గుండన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు ..

బుగ్గారం(ధర్మపురి): వేసవి పంటల సాగుకోసం గోదావరిలో నీటిని విడుదల చేసినందుకు మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, విప్ లక్ష్మణ్‌కుమార్,ఎమ్మెల్సీ వంశీ, నీటిపారుదల శాఖ మంత్రుల చిత్రపటాలకు స్థానిక రైతులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అయిత రత్నాకర్, గాజుల రమేశ్, అనుమల్ల శంకర్, గరిగంటి సత్తయ్య, జిల్లపెల్లి గంగారాం, ఈరవత్రిని రాజేశం పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత కొడిమ్యాల


ట్రోఫీని గెలుచుకున్న కొడిమ్యాల టీం

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలో వారం రోజుల నుంచి జరుగుతున్న క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. దీనిలో భాగంగా కొడిమ్యాల మాజీ సర్పంచ్ ఏలేటి మమత నరసింహారెడ్డి నిర్వహించిన సర్పంచ్ కప్ క్రికెట్ ఫైనల్ పోటీల్లో ప్రథమ స్థానంలో కొడిమ్యాల జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానాన్ని పూడూర్ నిలించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఊట్కూరి నరేందర్ రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏలేటి నరసింహారెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు రేకులపల్లి రవీందర్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు బండ నరసింహ రెడ్డి, రాచకొండ చందు,ఎండీ సల్మాన్, అనుమండ్ల అజయ్,గుర్రం నర్సయ్య గౌడ్, రాపర్తి లక్ష్మణ్, దీకొండ అశోక్, వంశీ, సూరజ్, సుమంత్, అఖిల్, పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ టోర్నమెంట్


బహుమతులతో క్రీడాకారులు

జగిత్యాలటౌన్: ఈనెల 12వ తేదీ నుంచి జగిత్యాల ప్రభుత్వ పురాతన పాఠశాలలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాస్కెట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాస్కెట్‌బాల్ సెక్రటరీ వేణుగోపాల్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోచ్ పడాల విశ్వప్రసాద్, పీడీలు నిరంజన్, పడాల కృష్ణప్రసాద్, అజయ్‌బాబు, సాగర్, వేణు, క్రీడాకారులు రాజ్‌కుమార్, సుమిత్ సామ్రాట్ పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ విజేత మేడిపల్లి

మేడిపల్లి: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలో ప్రారంభించిన ఫ్రెండ్లీ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచింది. విజేతలకు మొదటి బహుమతి ఐదు వేలు, రెండో బహుమతి మూడు వేల రూపాయలు అందించారు. కార్యక్రమంలో మకిలి దాసు, దేశవేని క్రిష్ణ, మిట్టపల్లి రమేష్‌రెడ్డి, హైమద్, లక్ష్మిరాజం, ప్రవీణ్, పాల్గొన్నారు.

నాసిరకంగా ఆలయ మండప నిర్మాణ పనులు


ఆలయంలో నిరసన తెలుపుతున్న యాదవ సంఘం సభ్యులు

మల్లాపూర్: ఆలయ మండప నిర్మాణ పనులను కాంట్రాక్టర్ నాసిరకంగా చేపడుతున్నాడని యాదవ సంఘం సభ్యులు ఆరోపించారు. మండల కేంద్రం శివారులోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ మండప నిర్మాణం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యాదవ సంఘం మండల అధ్యక్షుడు సంగ గంగరాజం మాట్లాడుతూ శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి టీటీడీ నిధులు రూ.10లక్షలు మంజురయ్యాయన్నారు. ఆలయం వద్ద మండప నిర్మాణ పనులు కాంట్రాక్టర్ నాసిరకంగా చేస్తున్నాడని ఆరోపణలు చేశారు. నిరసన కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మున్సిపల్ డీఈగా రాజేశ్వర్‌రావు

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ డీఈగా రాజేశ్వర్‌రావు నియమితులయ్యారు. శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని సూచించారు.

చలో మానుకోట యాత్ర విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఉద్యమకారులు

జగిత్యాల: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 19న తలపెట్టిన చలో మానుకోట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా చైర్మన్ జువ్వాజి శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు త్వరగా నెరవేర్చాలని, ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాగుల రాజు, నాచుపల్లి రెడ్డి, లింగారెడ్డి, సత్యంరావు, ప్రేమ్‌కుమార్, ఉమేందర్, రాజిరెడ్డి, శ్రీనివాస్, అంజయ్య పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- అంతర్గత సీసీ రోడ్లకు ప్రతిపాదనలు
- ఈజీఎస్ నిధులతో రోడ్ల నిర్మాణం

కోరుట్లరూరల్: కోరుట్ల మండలంలోని 9 గ్రామాల్లో అంతర్గత రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. దీని కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కోరుట్ల మండలానికి రూ.32.85 లక్షల నిధులు విడుదల చేసింది. ఈ నిధులను గ్రామాల్లో ఎంపిక చేసిన చోట సీసీరోడ్లు వేయనున్నారు. అందుకోసం పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయిలాపూర్‌కు రూ.7.5 లక్షలు, మోహన్‌రావుపేటకు రూ.4 లక్షలు, పైడిమడుగు రూ.3.83 లక్షలు, ధర్మారం రూ.3.5, చిన్నమెట్‌పల్లి రూ.4 లక్షలు, యూసుఫ్‌నగర్ రూ.3.5, నాగులపేట రూ.3.5 లక్షలు, కల్లూర్ రూ.2 లక్షలు, గుమ్లాపూర్ రూ. 1 లక్ష సీసీ రోడ్లకు ప్రతిపాదన ఫైళ్లు సిద్ధం చేసి కలెక్టర్ ఆమోదానికి పంపించారు.

నామినేటెడ్ పద్ధతిలో పనులు..

సీసీ రోడ్లకు సంబంధించిన ప్రొసీడింగ్‌లు వెలువడగానే నామినేటెడ్ పద్ధతితో పనులు నిర్వహించనున్నట్లు తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆయా గ్రామాల్లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పనులు నిర్వహించారు. కాగా ఈసారి గ్రామాల్లో ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగియటంతో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులకు పనులు చేపట్టనున్నట్లు సమాచారం.

బ్యాంకు ఎదుట బీజేపీ నాయకుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

బుగ్గారం(ధర్మపురి): రైతులపై బ్యాంకు సిబ్బంది వేధింపులకు వైఖరిని ఖండిస్తూ ధర్మపురి బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక కేడీసీసీ బ్యాంకు ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. మండలంలోని మద్దునూర్ గ్రామానికి చెందిన రైతు సోమ మల్లేశం ధాన్యం డబ్బులను రుణం కింద జమచేసుకున్నందుకు సదరు వ్యక్తి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్యాంకు అధికారుల తీరును ఖండిస్తూ బీజేపీ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రైతు కుటుంబానికి న్యాయం చేయాలని, అతనిపై నమోదు చేసిన కేసును వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పిల్లి శ్రీనివాస్,కొమ్ము రాంబాబు,కుమ్మరి తిరుపతి,మెడవేణి శ్రీధర్,నలుమాసు వైకుంఠం,గాజు భాస్కర్ పాల్గొన్నారు.

జాతీయ పసుపు బోర్డు అధ్యక్షుడికి సన్మానం

కోరుట్ల: జాతీయ పసుపు బోర్డు అధ్యక్షుడిగా నూతనంగా నియామకమైన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డిని కోరుట్ల బీజేపీ నాయకులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి బాబు, నాయకులు ఇట్యాల నవీన్, సుదవేణి మహేశ్, జిల్లా ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ అధ్యక్షుడికి..

మల్లాపూర్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఐ) అధ్యక్షుడు డాక్టర్ గంగసాగర్‌ను శుక్రవారం మల్లాపూర్‌కు చెందిన సీనియర్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. డాక్టర్ గంగసాగర్ వైద్య వృత్తిలో మరింతగా రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు రుద్ర రాంప్రసాద్, జోగినిపెల్లి లింగారెడ్డి, శ్రీపాద వెంకటాద్రి, చిట్యాల నవకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్, మండల అధికారులకు..

మల్లాపూర్: మెట్‌పల్లి సబ్ డివిజన్ కార్యలయంలో ఆర్డీవో శ్రీనివాస్‌తో పాటు మల్లాపూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ వీర్‌సింగ్, ఎస్సై రాజు, ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, ఎంపీవో జగదీష్‌లను శుక్రవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమృత మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుద్దు సురేందర్, నత్తి రాము తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ, లక్ష్మీపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3.30 నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఏఈ బి.సుందర్ తెలిపారు.

మల్యాల: మండలంలోని తాటిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని తాటిపల్లి, లంబాడిపల్లి గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగనుందని విద్యుత్ ఏఈ దయానంద్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మల్యాల, కొండగట్టు, తాటిపల్లి, తక్కళ్లపల్లి, మద్దుట్ల, రాంపూర్‌లో విద్యుత్ నిలిపివేయనున్నామని ఏడీఈ మహేందర్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఇబ్రహీంపట్నం, గోధూర్ సబ్‌స్టేషన్లలో పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీశ్ శుక్రవారం తెలిపారు.

కథలాపూర్: మండలంలోని చింతకుంట సబ్‌స్టేషన్ పరిధిలోని చింతకుంట, రాజారాం తండా గ్రామాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ దివాకర్‌రావు తెలిపారు.